

ఐటీఐలో శిక్షణ..ఉపాధికి నిచ్చెన

త్వరగా ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలనుకునే విద్యార్థులకు ఐటీఐ ఓ వరమని చెప్పవచ్చు. ప్రస్తుతం ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమైంది. - 8లో



కొడుకు దూరమై.. బతుకు భారమై

హార్సిలిహిల్స్‌లోని గంగోత్రి చెరువులో ఈతకు వెళ్లి మృతి చెందిన బాలకృష్ణ మృతదేహాన్ని వెలికి తీశారు.కొడుకు దూరం కావడంతో ఆ తల్లి తల్లడిల్లుతోంది. - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.100	రూ.120
రెండోరకం	రూ.60	రూ.90

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 398 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

నేడు ఒంటిమిట్టలో ఎంపీ, ఎమ్మెల్యే పర్యటన

ఒంటిమిట్ట : మండల పరిధిలోని చింతరాజుపల్లిలోని పత్రపల్లిలో గురువారం రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి, ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ్ రెడ్డిలు పర్యటించనున్నారు. ఈ విషయాన్ని మండల వైఎస్సార్ సిపి శ్రేణులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పర్యటనలో గురువారం పత్రపల్లి నందు జరగబోవు గంగమ్మ జాతరకు హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు వారు తెలిపారు.

ప్రశాంతంగా పాలిసెట్

రాయచోటి టౌన్ : జిల్లా వ్యాప్తంగా పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష (పాలిసెట్) ప్రశాంతంగా జరిగిందని జిల్లా కో ఆర్డినేటర్ శివశంకర్, డీఆర్‌వో మధుసూదన్‌రావు తెలిపారు. బుధవారం రాయచోటి, రాజంపేట, మదనపల్లె, కలికిరిలలో 11 సెంటర్లలో పరీక్షలు జరిగాయన్నారు. బాలురు 2376 మంది, 1605 మంది బాలికలు మొత్తం 3981 మంది హాజరయ్యారని తెలిపారు. పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సౌకర్యాలు కల్పించినట్లు చెప్పారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ ఏర్పాటు చేశామన్నారు. ఆయా మండల తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు ఏర్పాట్లు పర్యవేక్షించారని వివరించారు.

నర్సరీ పరిశీలన



నర్సరీలో మొక్కలను పరిశీలిస్తున్న కడప డీఎఫ్‌ఓ వినీత్‌కుమార్

సిద్దవటం : సిద్దవటం లోని అటవీ శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నర్సరీలోని మొక్కలను బుధవారం సాయంత్రం కడప డీఎఫ్‌ఓ వినీత్‌కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్సరీలో ఇంకొన్ని మొక్కలను పెంచి ప్రజలకు అందుబాటులో ఉంచాలని సిబ్బందికి సూచించారు. ప్లాంటేషన్‌ను మరింతగా అభివృద్ధి చేసి అటవీ ప్రాంతంలో మొక్కలు నాటడంతో పాటు ప్రజలకు అందుబాటులో ఉంచనున్నట్లు డీఎఫ్‌ఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో రేంజర్ కళావతి, డిప్యూటీ రేంజర్ కె. ఓబులేస్, టెక్నికల్ అసిస్టెంటు రమణ, అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

రాయచోటి జగదాంబసెంటర్ : జిల్లా పరిధిలో గల గిరిజన గురుకుల బాలుర పాఠశాలల్లో 3వ తరగతి, మిగతా తరగతుల్లో బ్యాక్‌లాగ్ ఖాళీలను నింపడానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి డి. సురేష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని టి.సుండుపల్లె, రాయచోటి, పీలేరు, తంబళ్లపల్లి, మదనపల్లెలలోని గిరిజన గురుకుల పాఠశాలల్లో ఖాళీలు ఉన్నాయన్నారు. ఎస్సీ -4, ఎస్టీ-32, బీసీ-2, ఓసీ-1, ఏఈక్యూ-1 సీట్లు 3వ తరగతిలో ఖాళీలు ఉన్నట్లు తెలిపారు. బ్యాక్‌లాగ్ ఖాళీలను ఎస్టీ విద్యార్థులకు మాత్రమే అవకాశం ఉందన్నారు. ఈ అవకాశాన్ని జిల్లాలోని గిరిజన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

బోగినేని మణిపై కేసు నమోదు

ఓబులవారిపల్లె : జనసేన పార్టీ నాయకుడు, రాయలసీమ జోనల్ కన్వీనర్ బోగినేని చిన్న మణిపై ఓబులవారిపల్లి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. మండలంలోని చెన్నరాజు పోడు గ్రామంలో ఏప్రిల్ 10న శ్రీరామనవమి గ్రామోత్సవం సందర్భంగా అర్ధరాత్రి పాత కక్షల కారణంగా ఎన్ఆర్ఐ పత్తి సుబ్బరాయుడు, అతని భార్య పత్తి రాజేశ్వరీపై జోగినేని దాడి చేశారు. ఈ విషయంపై పత్తి రాజేశ్వరీ దంపతులు రైల్వేకోడూరు సీఐ వెంకటేశ్వర్లు వద్ద ఫిర్యాదు చేశారు. విచారించిన పోలీసులు మంగళవారం రాత్రి మణిపై ఓబులవారిపల్లి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు.

భద్రకాళీసమేతుడికి చందన అలంకారం



చందనఅలంకరణలో స్వామి, అమ్మవారు

రాయచోటి టౌన్ : అక్షయ తృతీయ సందర్భంగా రాయచోటిలోని వీరభద్రస్వామి, భద్రకాళీ అమ్మవారు చందన అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. బుధవారం స్వామి, అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు. స్వామి, అమ్మవారిని దర్శించుకున్నారు. అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయంలో వెలసిన శ్రీ బసవ దేవుడికి బసవ జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఉర్దూ బడులకు ఉరి

- సెక్షన్ స్కూళ్ల నుంచి ఉర్దూ పోస్టుల తొలగింపు
- జి.ఓ 117 రద్దు పేరుతో మైనార్టీలకు చదువు దూరం
- మండిపడుతున్న ఉర్దూ భాషాభిమానులు
- అసంబద్ధంగా పాఠశాలల పునర్నిర్మాణ ప్రక్రియ



చింతపర్తి ఉర్దూ ప్రాథమికోన్నత పాఠశాల

మదనపల్లె సిటీ : పాఠశాలల పునర్నిర్మాణ ప్రక్రియలో భాగంగా కూటమి ప్రభుత్వం విద్యాశాఖలో చేడపతున్న సంస్కరణలు ఉర్దూ పాఠశాలలు, టీచర్లపై ప్రతికూల ఫలితాలు తీసుకొస్తున్నాయి. ఈ చర్యలు చూస్తుంటే మైనార్టీలను విద్య నుంచి దూరం చేయడమే లక్ష్యంగా కనిపిస్తున్నాయి. గత ప్రభుత్వం తీసుకొచ్చిన జీఓ 117ను రద్దు చేసి వాటి స్థానంలో మెరుగైన వ్యవస్థ నిర్మిస్తామని గొప్పలు చెప్పిన ప్రభుత్వం చర్యలు చూస్తుంటే ..కొండ నాలుకకు మందేస్తే ఉన్న నాలుక ఊడిపోయినట్లుగా తయారైంది. కూటమి ప్రభుత్వం చేడపతున్న పాఠశాలల పునర్నిర్మాణ ప్రక్రియతో అయోమయ పరిస్థితులు నెలకొన్నాయి. మార్చి నాటికి ఉన్న విద్యార్థుల సంఖ్య ఆధారంగా చేసుకుని ప్రభుత్వం పాఠశాలలకు పోస్టులు కేటాయిస్తూ చర్యలు తీసుకుంటోంది. అయితే ఈ చర్యల వల్ల ఉర్దూ యూపీ పాఠశాలల సెక్షన్ స్కూళ్లకు తీవ్రంగా నష్టం జరుగుతోంది.

ఉర్దూ యూపీ పాఠశాలలకు మంగళం..

పాఠశాలల పునర్నిర్మాణంలో భాగంగా యూపీ పాఠశాలల్లోని 6,7,8 తరగతుల్లో 30కుపైగా విద్యార్థుల సంఖ్య ఉండాలి. ఏదేనీ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య 30 కంటే తక్కువ వుంటే వాటిని ప్రాథమిక పాఠశాలగా డీ గ్రేడ్ చేశారు. దీనివల్ల మారుమూల ప్రాంతాల్లోని ఉర్దూ యూపీ పాఠశాలల్లో చదివే మైనార్టీ పిల్లలు చదువులకు దూరం కావాల్సి వస్తోంది. మైనార్టీలలో చదివే వారి సంఖ్య అంతంతమాత్రమే ఉంటుంది. దీనికి తోడు ఆయా పాఠశాలల డీగ్రేడ్ వల్ల ప్రభుత్వమే వారిని బలవంతంగా చదువు మాన్పించేలా చేస్తోందన్న ఆరోపణలు ఉన్నాయి. మదనపల్లె విద్యాశాఖ డివిజన్ పరిధిలోని వాల్మీకిపురం మండలం చింతపర్తి గ్రామంలో గత 25 సంవత్సరాలుగా యూపీ పాఠశాల ఉండగా దానిని అర్థాంతరంగా ప్రాథమిక పాఠశాల స్థాయికి కుదించారు. బి.కొత్తకోట మండలంలోని గట్టు ఉర్దూ యూపీ పాఠశాల, మదనపల్లె మండలం బోడుమల్లదిన్నె, కురబలకోట మండలంలోని ముదివేడు ఉర్దూ యూపీ పాఠశాలలను ప్రాథమిక పాఠశాలలుగా స్థాయిని తగ్గించారు. దీంతో ఆయా పాఠశాలల విద్యార్థులు 10 నుంచి 25 కిలో మీటర్ల దూరంలోని ఉన్నత పాఠశాలలకు వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడింది. దీంతో రాబోయే రోజుల్లో విద్యార్థులు చదువులకు శాశ్వతంగా దూరమయ్యే పరిస్థితి ఏర్పడింది.

సెక్షన్ స్కూళ్లలోని ఉర్దూ పోస్టులు మాయం

దశాబ్దాల కాలం నుంచి అనేక తెలుగు మీడియం ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఉర్దూ సెక్షన్లు ఉండేవి. ఇందులో తెలుగు ఉపాధ్యాయులతో పాటు ఉర్దూభాష బోధించేందుకు ఉర్దూ ఉపాధ్యాయులు ఉండేవారు. ఈ పోస్టులు తెలుగు పోస్టులకు అదనంగా ఏదేని ఒక ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయ విద్యార్థి నిష్పత్తి ప్రకారం ఉపాధ్యాయ పోస్టులను మంజూరు చేసి వీటికి అదనంగా ఉర్దూభాష బోధించుటకు ఓ ఉర్దూ ఉపాధ్యాయుడిని నియమించేవారు. అయితే పాఠశాలల పునర్నిర్మాణంలో భాగంగా సెక్షన్ స్కూళ్ల నుంచి ఉర్దూ పోస్టును తీసేశారు. ఉదాహరణకు ఒక తెలుగు మీడియం సెక్షన్ స్కూల్‌లో 20 మంది విద్యార్థులుంటే అందులో 10 మంది తెలుగుమాధ్యమంలో పాఠ్యాంశాలు చదివి ఒక భాష ఉర్దూ చదివేవారు. ఇది వరకున్న నిబంధనల ప్రకారం ఆ పాఠశాలకు ఒక ఉర్దూ, ఒక తెలుగు ఉపాధ్యాయ పోస్టు మంజూరు చేయాల్సి ఉంటుంది. అయితే కూటమి ప్రభుత్వం ఇలాంటి పాఠశాలలకు కేవలం తెలుగు పోస్టు కేటాయించి, ఉర్దూ పోస్టును తొలగించింది. దీంతో దశాబ్దాలుగా ఉర్దూ చదువుకునే విద్యార్థులు ఆ భాషను చదివే అవకాశాన్ని కోల్పోతున్నారు. బి కొత్తకోట మండలంలోని గోళ్లపల్లి ప్రాథమిక పాఠశాల, నిమ్మనపల్లె మండలం ముష్టూరు ప్రాథమిక పాఠశాలతో పాటు మరిన్ని పాఠశాలలు ఈ జాబితాలో ఉన్నాయి.

ఉర్దూభాష నిర్వీర్యమే లక్ష్యమా?

కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన పాఠశాలల పునర్నిర్మాణ ప్రక్రియను లోతుగా పరిశీలిస్తే ఇది మైనార్టీ, ఉర్దూ భాషల నిర్వీర్యమే లక్ష్యంగా కనిపిస్తోంది. మైనార్టీల్లో అక్షరాస్యత శాతం చాలా తక్కువగా ఉంటుంది. విద్యాపరంగా వారి అభివృద్ధికి అవకాశాలు కల్పించాలని ఒక వైపు కమీషన్లు ఘోషిస్తున్నప్పటికీ కూటమి ప్రభుత్వం దీనికి విరుద్ధంగా చర్యలు తీసుకుంటుండటం చూస్తుంటే ప్రభుత్వానికి మైనార్టీ, ఉర్దూభాషపై ఉన్న ప్రేమ ఇలాగే కనిపిస్తోంది.

ఉర్దూ భాషకు న్యాయం చేయాలి



పాఠశాలల పునర్నిర్మాణ ప్రక్రియలో భాగంగా ఉర్దూ పాఠశాలలకు న్యాయం చేయాలి. డీఎస్సీ ఉర్దూ మాధ్యమానికి సంబంధించి పోస్టుల సంఖ్యను పెంచాలి. ప్రతి జిల్లాకు కనీసం వంద పోస్టులు ఇచ్చి ఉర్దూ నిరుద్యోగులను ఆదుకోవాలి. ఉర్దూ పాఠశాలలను బలోపేతం చేయాలి.

– అబ్దుల్ కలీమ్, ఉర్దూ అకాడమీ మాజీ డైరెక్టర్.

ఉర్దూ యూపీ,సెక్షన్ స్కూళ్లను కొనసాగించాలి



పాఠశాలలలో పునర్నిర్మాణలో భాగంగా విద్యార్థుల సంఖ్యతో నిమిత్తం లేకుండా ఉర్దూ యూపీ పాఠశాలలను కొనసాగించాలి. అలాగే అన్ని సెక్షన్ స్కూళ్లోనూ ఉర్దూ సెక్షన్‌ను మంజూరు చేసి ఉర్దూ విద్యను బలోపేతం చేయాలి.

– జమాల్‌బాషా, కో ఆప్షన్ సభ్యులు,తంబళ్లపల్లె

పురాతన ఆలయాల అభివృద్ధికి కృషి



ఆలయ పరిసరాలను పరిశీలిస్తున్న జిల్లా అధికారి విశ్వనాథ్ తదితరులు

పెద్దతిప్పసముద్రం : శిధిలావస్థకు చేరుకున్న పురాతన కాలం నాటి ఆలయాలను అభివృద్ధి చేస్తామని జిల్లా దేవదాయ శాఖ అధికారి విశ్వనాథ్ అన్నారు. విజయవాడలోని దేవదాయ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు బుధవారం ఆయన మండలంలోని పలు ఆలయాలను ఆకస్మికంగా తనిఖీ చేసారు. మండల కేంద్రంలోని చెన్నకేశవ స్వామి, విరూపాక్షేశ్వర్వామి, కందుకూరులోని పట్టాభి రామాలయాన్ని పరిశీలించారు. ఆలయాల్లో నిత్య పూజలు, దూప,దీప నైవేద్యాలు జరుగుతున్నాయా అని ఆరా తీశారు. అనంతరం కందుకూరు వ్యాసరాయ చెరువు కొండ వద్ద వెలసిన శ్రీ వేధగిరి నరసింహ స్వామి ఆలయాన్ని పరిశీలించారు. ఈ ఆలయం వద్ద ఎలాంటి జన సంచారం లేని విషయాన్ని గుర్తించిన పలువురు గుర్తు తెలియని దుండగులు గతంలో గుప్త నిధుల కోసం గోపురం, ధ్వజ స్తంభాలను ధ్వంసం చేశారని పూజారి గంగాధర్ శాస్త్రి, ఆలయ ధర్మకర్త కరణం ప్రకాష్‌రావ్‌లు దేవదాయ శాఖ అధికారికి వివరించారు. ఈ ఆలయ పునరుద్దరణకు ప్రత్యేక చొరవ చూపాలని సూచించగా అధికారి సానుకూలంగా స్పందించి నివేదికను ఉన్నతాధికారులకు పంపుతామన్నారు. అనంతరం నవాబుకోట పంచాయతిలో శ్రీ భైరవేశ్వర స్వామి ఆలయ నిర్మాణం కోసం 363 సర్వే నంబర్‌లోని 15 సెంట్ల ప్రభుత్వ భూమి మంజూరు చేయాలని కోరుతూ భాస్కర్ అనే వ్యక్తి ఇటీవల జిల్లా కలెక్టర్‌కు దరఖాస్తు చేసుకోగా సదరు స్థలాన్ని కూడా జిల్లా అధికారి పరిశీలించారు. ఆయన వెంట అర్చకుల సమాఖ్య జిల్లా అధ్యక్షుడు చెన్నకేశవయ్య తదితరులు ఉన్నారు.

నేడు కొలువుతీరనున్న గంగమ్మ

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు పట్టణంలో భక్తుల కొంగుబంగారంగా విరాజిల్లుతున్న కోడూరు గంగమ్మ జాతర నేడు గురువారం జరగనుంది. ఉదయం 5 గంటలకు పొట్టి శ్రీరాముల వీధిలోని అంకాలమ్మ గుడి దగ్గర నుంచి ఊరేగింపుగా తీసుకొస్తారు. గంగమ్మ మిట్టలో గంగమ్మ కొలువుతీరనుంది. ఉదయం 6 గంటల నుంచి భక్తులకు దర్శనభాగ్యం కల్పించనున్నారు. అలాగే ఉదయం వసంతోత్సవంతో గంగమ్మను ఉంగరాల నగర్ వద్ద నిమజ్జనం చేయనున్నారు. ఈ ఏడాది ఎటువంటి వీఐపీ పాస్‌లు లేకుండా అమ్మవారి దర్శనభాగ్యం కల్పించనున్నారు. జాతర నేపథ్యంలో బుధవారం సాయంత్రం నుంచి అర్ధరాత్రి వరకు డప్పు వాయిద్యాలు, చెక్కభజన కళాకారుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి.



గంగమ్మ తల్లి కొలువుతీరనున్న గంగమ్మ మిట్ట



ఆకట్టుకున్న డప్పు వాయిద్య కళాకారుల విన్యాసం

కళ తప్పిన పసిడి పురి

- ఒడిదుడుకుల మధ్య బంగారు వ్యాపారం
- ఆర్థిక ఇబ్బందుల్లో వ్యాపారులు, కార్మికులు
- నగదు చెల్లిస్తేనే బంగారం



ప్రొద్దుటూరు : వ్యాపారంలో ఒడిదుడుకులు కారణంగా పసిడిపురి కళ తప్పింది. అమాంతంగా బంగారం ధరలు పెరగడంతోపాటు ఆర్థిక ఇబ్బందుల కారణంగా బంగారం కొనుగోలు చేసేందుకు ప్రజలు ఆసక్తి చూపడం లేదు. శుభకార్యాల కోసం అవసరాలకు మాత్రమే ఆభరణాలను కొనుగోలు చేస్తున్నారు. పైగా కొనుగోలుదారులు పూర్తిగా నగదు చెల్లిస్తే కానీ వ్యాపారులు ఆభరణాలను తయారు చేయించి ఇచ్చే పరిస్థితి లేదు.

రాష్ట్రంలో పసిడి వ్యాపారానికి ప్రొద్దుటూరు ప్రసిద్ధి గాంచింది. బంగారు ఆభరణాల దుకాణాలతోపాటు వేల మంది స్వర్ణకార్మికులు ఈ వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నారు. ప్రత్యేక్షంగా, పరోక్షంగా వేలాది మందికి బులియన్ మార్కెట్ ఉపాధి కల్పిస్తోంది. ఈ ఏడాది జనవరి 1న 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.78,500 నమోదైంది. మార్చి 11న రూ.86వేలు ఉండగా.. ఈనెల 22న ఇదే ధర రూ.లక్షకు దాటింది. దేశంలోని మిగతా ప్రాంతాల్లో రూ.లక్షా 5వేల వరకు ధర పలకగా, ప్రొద్దుటూరులో రూ.లక్షకు చేరుకుంది. ధరల హెచ్చు తగ్గులతో అటు వ్యాపారులు, ఇటు స్వర్ణ కార్మికులు, కొనుగోలుదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అవసరాలకు సంబంధించి గతంలో బంగారు ఆభరణాల కోసం వచ్చే వారు కేవలం అడ్వాన్స్ రూపంలో కొంత మొత్తాన్ని చెల్లించి మిగతా సొమ్మును ఆభరణాలు తయారు చేశాక డబ్బు చెల్లించి తీసుకెళ్లే పరిస్థితి ఉండేది. ప్రస్తుతం ధరల ప్రభావం కారణంగా పూర్తి డబ్బు కొనుగోలు దారులు చెల్లిస్తే కానీ ఆభరణాలు తయారు చేయించే పరిస్థితి లేదు. స్వయంగా వ్యాపారులే ఈ విషయాన్ని చెబుతున్నారు.



ఆభరణం తయారు చేస్తున్న స్వర్ణకార్మికుడు

రియల్ ఎస్టేట్ ప్రభావమే పెద్ద కారణం

గత ఏడాది ఎన్నికల ముందు నుంచి రియల్ ఎస్టేట్ వ్యాపారం కుదేలైంది. భూముల కొనుగోలు, అమ్మకాలు ధమాల్ అన్నాయి. తద్వారా మార్కెట్‌లో మనీ రొటేషన్ లేదు. మరో వైపు రష్యా-ఉక్రెయిన్ యుద్ధం, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆంక్షల ప్రభావం బంగారం మార్కెట్‌పై పడింది. అన్ని వ్యాపారాలపైన ఇదే పరిస్థితి ఉందని వ్యాపార నిపుణులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నడూ ఇంతటి ఇబ్బందులు చూడలేదని వాపోతున్నారు.

వ్యాపారాలు లేవు



బంగారు ధరల హెచ్చుతగ్గుల ప్రభావం మార్కెట్‌పై తీవ్రంగా ఉంది. గత రెండేళ్లుగా రియల్ ఎస్టేట్ వ్యాపారం లేకపోవడం మరోకారణం. వ్యాపారులు ముడి బంగారం కొనేందుకు భయపడుతున్నారు. ఎప్పుడు పెరుగుతుందో, ఎప్పుడు తగ్గుతుందో చెప్పలేని పరిస్థితి ఏర్పడింది. దీంతో వ్యాపారాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం.

– బుశెట్టి రాంమోహన్‌రావు, రాష్ట్ర బులియన్ మర్చంట్స్ అసోసియేషన్ మాజీ ఉపాధ్యక్షుడు.

ధరలు అమాంతం పెరిగాయి



బంగారం ధరలు అమాంతం పెరిగాయి. సాధారణ మధ్యతరగతి ప్రజలు బంగారం చూసేందుకే తప్ప కొనుగోలు చేసే పరిస్థితి లేదు. తులం బంగారం రూ.లక్ష దాటి అందరినీ ఆశ్చర్యానికి గురి చేసింది. ధరలు ఇంకా పెరుగుతాయని కొందరు, తగ్గుతాయని మరికొందరు ప్రచారం చేస్తున్నారు. మార్కెట్‌లో అనిశ్చితి ఏర్పడింది. కార్మికులకు ఉపాధి లేదు.

– ఎస్.అహ్మద్ హుస్సేన్, ప్రొద్దుటూరు బులియన్ మర్చంట్స్ సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షుడు.

ఐటీఐల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

రాజంపేట టౌన్ : జిల్లాలోని మూడు ప్రభుత్వ, పన్నెండు ప్రైవేట్ ఐటీఐలలో ప్రవేశాలకు మే 24వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని పారిశ్రామిక శిక్షణా సంస్థ జిల్లా కన్వీనర్, రాజంపేట ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ రఘురామిరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజంపేట, పీలేరు, తంబళ్లపల్లె ప్రభుత్వ ఐటీఐలలో 392 సీట్లు, ప్రైవేట్ ఐటీఐలలో 1,064 సీట్లు ఉన్నాయని తెలిపారు. ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, మెకానిక్ మోటర్, డ్రాఫ్ట్స్‌మెన్ సివిల్, ఎలక్ట్రానిక్స్ మెకానిక్, కోపా ట్రేడ్‌లలో ప్రవేశాలకు పదవ తరగతి ఉత్తీర్ణులై ఉండాలన్నారు. వెల్డర్, వైర్‌మెన్ ట్రేడ్‌లలో ప్రవేశానికి 8వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలని తెలిపారు. అర్హత కలిగి, ఐటీఐలో చేరేందుకు ఆసక్తిగల విద్యార్థులు iti.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా మే 24వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు మే 26వ తేదీలోగా తమకు సమీపంలోని ప్రభుత్వ ఐటీఐలలో అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లను వెరిఫికేషన్ చేయించుకోవాలన్నారు. సర్టిఫికెట్లు వెరిఫికేషన్ చేయించుకున్న విద్యార్థులకు మాత్రమే మెరిట్ జాబితాలో చోటు లభిస్తుందని తెలిపారు. మరిన్ని వివరాలకు 9849497639, 8919256229 నంబర్లలో సంప్రదించవచ్చని తెలిపారు.

రిమ్స్ మౌలిక సదుపాయాలకు విరాళం

కడప సెవెన్‌రోడ్స్ : యురేనియం కార్పొరేషన్ లిమిటెడ్ (యూసీఐఎల్) జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రి మౌలిక సదుపాయాలు కల్పన, పరికరాల కొనుగోలు కోసం కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్)నిధుల కింద రూ. 53.67 లక్షల విరాళ చెక్కును కలెక్టర్ శ్రీధర్ చెరుకూరికి అందజేశారు. బుధవారం కలెక్టర్ క్యాంప్ ఆఫీసులో యురేనియం కార్పొరేషన్ ఆఫ్ ఇండియా డైరెక్టర్ (టెక్నికల్) మనోజ్ కుమార్, జనరల్ మేనేజర్ (మిల్) సుమన్ సర్కార్, సంస్థ ప్రతినిధులు జిల్లా కలెక్టర్‌ను కలసి చెక్ ను ఇచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వేముల మండలం తుమ్మలపల్లి యురేనియం కార్పొరేషన్ ఆఫ్ ఇండియా అందజేసిన నిధులతో ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి రిమ్స్‌లో ఆప్తమాలజీ, ఆర్థోపెడిక్స్, టీబీజీ గైనిక్ ఇఎన్టి, రేడియాలజీ అనిస్థిసియా డిపార్టుమెంట్స్ లలో పరికరాల కొనుగోలుకు వినియోగించనున్నట్లు తెలిపారు. ఆకాంక్షిత జిల్లా అభివృద్ధిలో భాగంగా ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో మౌలిక వసతుల కల్పనలకు దాతలు ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో యూసీఐఎల్ సీఎస్ఆర్ ఆఫీసర్ నవీన్ రెడ్డి, జియాలజిస్ట్ సురేంద్ర విజయ్ కుమార్, మేనేజర్ పీకే నాయక్ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఫారంపాండ్ పనుల తనిఖీ



పశువుల నీటి తొట్టిని పరిశీలిస్తున్న డ్వామా పీడీ వెంకటరత్నం

సుండుపల్లె : మండల పరిధిలోని ఈడిగపల్లె, మాచిరెడ్డిగారిపల్లె గ్రామాల్లో నిర్మించిన ఫారంపాండ్, పశువుల నీటితొట్లు, ఊటకుంట పునరుద్ధరణ పనులను డ్వామా పీడీ వెంకటరత్నం బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండల తీవ్రత ఎక్కువగా ఉండటంతో భూగర్భ జలాలు తగ్గి బోర్లలో నీరు తక్కువ వస్తున్నాయన్నారు. ఈ నేపథ్యంలో రైతులు ఇబ్బంది పడకుండా చెట్ల పెంపకానికి ఫారంపాండ్లు, పశువుల దాహార్తిని తీర్చడానికి నీటి తొట్లు ఉపయోగపడతాయని తెలిపారు. ఉపాధిహామీ పథకం ద్వారా 5 ఎకరాల్లోపు ఖాళీ భూమి ఉన్న రైతులకు ఉద్యాన శాఖ ద్వారా 24 రకాల ఉద్యాన మొక్కలు పెంచుకొనేందుకు అవకాశం కల్పించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏపీఓ మాలిక్‌బాషా, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మద్యం బాటిళ్లు స్వాధీనం

పెద్దమండ్యం : మద్యం బాటిళ్లు విక్రయిస్తున్న ఇద్దరిని బుధవారం అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ పీవీ రమణ తెలిపారు. ఆయన కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని సీ గొల్లపల్లె పంచాయతీ బాటవారిపల్లెలో చింతచెట్టుకింద మద్యం బాటిళ్లు విక్రయిస్తుండగా ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వీరి నుంచి 92 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఈ మేరకు బాటివారిపల్లెకు చెందిన నాగేశ్వరమ్మ, ఆనందరెడ్డిలను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. ఎక్కడైనా బెల్ట్‌షాపులు నిర్వహిస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

నాలుగు ఆటోలు సీజ్



వాహనాల రికార్డులు తనిఖీ చేస్తున్న ఎంవీఐ విజయకుమారి

పీలేరు రూరల్ : రికార్డులు సక్రమంగా లేని నాలుగు ఆటోలు సీజ్ చేయడంతోపాటు రూ. 21,610 జరిమానా విధించినట్లు ఎంవీఐ పి. విజయకుమారి తెలిపారు. బుధవారం స్థానిక సదుం మార్గంలో ఆర్టీసీ పీలేరు డిపో మేనేజర్ బి. నిర్మలతో కలసి స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఆటోల రికార్డులు పరిశీలించి సక్రమంగా లేని ఆటోలు సీజ్ చేసి, జరిమానా విధించినట్లు తెలిపారు. రోడ్డు నియమాలు అతిక్రమించి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఎయిడ్స్‌పై విస్తృతమైన అవగాహన కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ అధికారి డాక్టర్ శైలజ

రాయచోటి టౌన్ : గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో క్షేత్రస్థాయిలో ఎయిడ్స్‌పై విస్తృతమైన అవగాహన కల్పించాలని జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ వైద్యాధికారి డాక్టర్ శైలజ సూచించారు. బుధవారం పట్టణంలోని ఎస్‌ఎన్ కాలనీలోని పట్టణ ఆరోగ్య కేంద్రంలో జిల్లా ఆరోగ్యశాఖ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రజలలో అవగాహన కలిగినప్పుడే ఈ వ్యాధులను నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో ఏఆర్టీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అనూష తదితరులు పాల్గొన్నారు.

విభూత్యాలంకారంలో ఇంద్రనాథేశ్వర స్వామి

వల్లూరు : పుష్పగిరి క్షేత్ర ఆలయాల సముదాయంలో భాగమైన చింతలపత్తూరులోని శ్రీ ఇంద్రనాథేశ్వర స్వామి ఆలయంలో మూడు రోజులుగా జరుగుతున్న ఆలయ వార్షికోత్సవాలు ఘనంగా ముగిశాయి. ఇందులో భాగంగా అక్షయ తృతీయను పురస్కరించుకుని బుధవారం ఉదయం వేద పండితుల ఆధ్వర్యంలో స్వామి వారికి ప్రాతఃకాలపూజ, మహాన్యాసపూర్వక ఏకాదశవార రుద్రాభిషేకం నిర్వహించారు. భక్తులు విభూత్యాలంకారంలోని స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థికి గాయాలు

మైదుకూరు : పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా పోతిరెడ్డిపాలెం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మైదుకూరుకు చెందిన వైద్య విద్యార్థి వీరమల్లు నవనీత్ కుమార్ గాయపడ్డాడు. నవనీత్ కుమార్ తండ్రి వీరమల్లు మల్లేష్ వైఎస్సార్ జిల్లా డిప్యూటీ డీఎంహెచ్‌ఓగా పనిచేస్తున్నారు. పోతిరెడ్డిపాలెం వద్ద కారు ఇంటిని ఢీకొట్టిన సంఘటనలో ఐదుగురు వైద్య విద్యార్థులు అక్కడికక్కడే మృతి చెందగా, నవనీత్‌కుమార్ తీవ్రంగా గాయపడి ఐసీయూలో చికిత్స పొందుతున్నాడు. సంఘటన గురించి తెలియగానే నవీనత్ కుమార్ తండ్రి డాక్టర్ మల్లేష్ కుటుంబ సభ్యులతో కలిసి హుటాహుటిన నెల్లూరుకు బయల్దేరారు.

ఐటీఐలో శిక్షణ..ఉపాధికి నిచ్చెన

- కోర్సు పూర్తికాగానే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు
- ప్రవేశాలకు మొదలైన దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ



ప్రాక్టికల్స్‌లో తర్ఫీదు పొందుతున్న మోటార్ మెకానిక్ విద్యార్థులు

రాజంపేట టౌన్ : కుటుంబ ఆర్థిక పరిస్థితుల కారణంగా త్వరగా ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలనుకునే విద్యార్థులకు ఐటీఐ ఓ వరమని చెప్పవచ్చు. ఐటీఐలో ఏ ట్రేడ్ కోర్సు పూర్తి చేసినా ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయి. అలాగే ప్రధానంగా రైల్వే, ఆర్టీసీ, విద్యుత్‌శాఖ వంటి ప్రభుత్వరంగ సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు పొందవచ్చు. పరిశ్రమల్లో ఉద్యోగ అవకాశాల కల్పనలో ఐటీఐ పూర్తి చేసిన వారికి ప్రాధాన్యత ఉంటుంది. స్వయంగా కూడా ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకునే అవకాశం ఉంది. ప్రస్తుతం ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమైంది.

జిల్లాలో 15 ఐటీఐలు..

అన్నమయ్య జిల్లాలో మొత్తం 15 ఐటీఐలు ఉన్నాయి. ఇందులో మూడు ప్రభుత్వ ఐటీఐలు కాగా 12 ప్రైవేట్ ఐటీఐలు ఉన్నాయి. రాజంపేట, పీలేరు, తంబళ్లపల్లెలో ఒక్కొక్క ప్రభుత్వ ఐటీఐ ఉంది. ప్రైవేట్ ఐటీఐల విషయానికి వస్తే మదనపల్లెలో నాలుగు, రాయచోటిలో రెండు, రాజంపేట, రైల్వేకోడూరు, తంబళ్లపల్లె, పీలేరు, గుర్రంకొండ, వాయల్పాడులో ఒక్కో ప్రైవేట్ ఐటీఐ ఉంది.

మార్కుల ఆధారంగా సీట్ల కేటాయింపు..

ఐటీఐలో ప్రధానమైన ట్రేడ్‌లలో ప్రవేశానికి టెన్త్ ఉత్తీర్ణులై ఉండాలి. అయితే టెన్త్‌లో సాధించిన మార్కులు, రిజర్వేషన్ ఆధారంగా ఐటీఐలో సీట్ల కేటాయింపు ఉంటుంది. టెన్త్‌లో అత్యధిక మార్కులు సాధించిన వారికి కోరుకున్న ఐటీఐ కేంద్రంలో, ట్రేడ్ ఎంపికలో ప్రాధాన్యత ఉంటుంది. టెన్త్‌లో కొంత మంది విద్యార్థులకు సమానమైన మార్కులు వచ్చినప్పుడు గణితంలో ఎక్కువ మార్కులు వచ్చిన వారికి ప్రాధాన్యత ఇస్తారు. గణితంలో కూడా సమానమైన మార్కులు వచ్చివుంటే సైన్స్‌లో అత్యధిక మార్కులు వచ్చిన వారికి ప్రాధాన్యత ఉంటుంది. ఒకవేళ గణితం, సైన్స్ రెండు పాఠ్యాంశాలలో సమానమైన మార్కులు వచ్చినప్పుడు పుట్టిన తేదీని పరిగణలోకి తీసుకొని ఎక్కువ వయస్సు ఉన్న వారికి ప్రాధాన్యత ఇస్తారు. రిజర్వేషన్ల కేటగిరిని కూడా పరిగణలోకి తీసుకొని సీట్లను భర్తీ చేస్తారు.

ఉద్యోగ, ఉపాధి అవకాశాలు

ఐటీఐలో ఉత్తీర్ణులై అప్రెంటీస్ కూడా పూర్తి చేసుకుంటే 18 ఏళ్లు దాటగానే పరిశ్రమల్లో ఉద్యోగ అవకాశాలను సులువుగా అందిపుచ్చుకోవచ్చు. అలాగే విద్యుత్, రక్షణ, రైల్వే రంగాల్లో ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉంటాయి. అయితే విద్యార్థులు వారికి సంబంధించిన ట్రేడ్‌లలో మంచి నైపుణ్యం కలిగి ఉంటే స్వయంగా కూడా ఉపాధి అవకాశాలను పొందవచ్చు.

నేరుగా పాలిటెక్నిక్‌లోకి ప్రవేశం

ఐటీఐలో రెండేళ్ల కోర్సు పూర్తి చేసుకున్న విద్యార్థులు నేరుగా పాలిటెక్నిక్ రెండవ సంవత్సరంలో ప్రవేశానికి అర్హులవుతారు. పాలిటెక్నిక్ చదవాలనుకునే విద్యార్థులు తొలుత నెలరోజుల వ్యవధిగల బ్రిడ్జి కోర్సు చేసి ఉత్తీర్ణత సాధించాల్సి ఉంటుంది.

ట్రేడ్‌ల వారీగా బ్రాంచ్‌లు కేటాయింపు

ఐటీఐలో ఉత్తీర్ణత సాధించిన ట్రేడ్‌లను బట్టి పాలిటెక్నిక్‌లో బ్రాంచ్‌ల కేటాయింపు ఉంటుంది. ఐటీఐలో ఎలక్ట్రీషియన్ కోర్సు పూర్తి చేసిన వారికి పాలిటెక్నిక్‌లో ఎలక్ట్రికల్ బ్రాంచ్‌లో సీటు కేటాయిస్తారు. అలాగే ఫిట్టర్, టర్నర్ మెషినిస్టు, రిఫ్రిజిరేటర్ అండ్ ఎయిర్ కండీషన్ కోర్సు చేసిన వారికి మెకానికల్ బ్రాంచ్‌లో, ఎలక్ట్రానిక్స్ మెకానిక్, రేడియో అండ్ టీవీ మెకానిక్ కోర్సు చేసిన వారికి ఎలక్ట్రానిక్స్ బ్రాంచ్‌లో, మెకానిక్ మోటార్ వెహికల్ ఉత్తీర్ణులైన వారికి ఆటోమొబైల్ బ్రాంచ్‌లో సీటు కేటాయిస్తారు.

ఉజ్వల భవిష్యత్తు



వివిధ కారణాల రీత్యా ఉన్నత చదువులు చదివేందుకు వీలు కాని వారికి ఐటీఐ చేస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుంది. ఐటీఐ కోర్సు పూర్తి చేసుకున్న వారికి తప్పక ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెండుగా లభిస్తాయి. ప్రతిభ గల విద్యార్థులకు ఐటీఐ పూర్తి చేసిన తరువాత ప్రైవేట్ కంపెనీల్లో ఉద్యోగ అవకాశం కల్పించేందుకు కృషి చేస్తాము. ఆర్థిక పరిస్థితుల కారణంగా త్వరగా జీవితంలో స్థిరపడాలనుకునే విద్యార్థులకు ఐటీఐ ఓ వరం లాంటిది.

ఆర్.రఘురామిరెడ్డి, జిల్లా కన్వీనర్, పారిశ్రామిక శిక్షణా సంస్థ

మిట్స్ జాతీయ సింపోజియంలో మాజీ రాష్ట్రపతుల మనవడు



జి. సుబ్రమణ్యం శర్మకు సత్కారం

కురబలకోట : భారత మాజీ రాష్ట్రపతులు సర్వేపల్లి రాధాకృష్ణన్, వీవీ గిరి మనవడు డాక్టర్ జి. సుబ్రమణ్యం శర్మ అంగళ్లులోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాల బుధవారం జాతీయ స్థాయిలో నిర్వహించిన టెక్నికల్ సింపోజియం జీమాక్స్-25లో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈయన బెంగళూరు సుదీక్ష గ్రూప్ ఆఫ్ కంపెనీస్ మేనేజింగ్ డైరెక్టర్‌గా కొనసాగుతున్నారు. ఆయన సింపోజియంలో మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యం కోసం పని చేసి జీవితంలో రాణించాలన్నారు. యువ ఇంజినీర్లు ప్రాజెక్టు ఆధారిత అభ్యాసం ద్వారా పరిశ్రమల అవసరాలకు తగ్గట్లు నైపుణ్యాలను పెంచుకోవాలన్నారు. సరికొత్త ఆవిష్కరణలకు తెరలేపాలని సూచించారు.

బాలిక అదృశ్యం

పెద్దతిప్పసముద్రం : మండలంలోని తుమ్మరకుంట పంచాయతీ కొత్తపల్లికి చెందిన ఓ మైనర్ బాలిక (17) గత రెండు రోజుల క్రితం అదృశ్యమైంది. బంధువులు, చుట్టు పక్కల గ్రామాల్లో బాలిక ఆచూకీ లేకపోవడంతో అదృశ్యమైనట్లు భావించిన బాధిత కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్



మాట్లాడుతున్న జిల్లా రిజిస్ట్రార్ శ్రీనివాస్, సబ్ రిజిస్ట్రార్ గురుస్వామి

మదనపల్లె : అన్నమయ్య జిల్లాలోని అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ సేవలను అందుబాటులోకి తీసుకు వచ్చినట్లు జిల్లా రిజిస్ట్రార్ శ్రీనివాస్ తెలిపారు. బుధవారం మదనపల్లె సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వచ్చిన ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రిజిస్ట్రేషన్ అవసరాల కోసం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో గంటల తరబడి ఎదురుచూసే విధానానికి ప్రభుత్వం స్వస్తి పలికిందన్నారు. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా స్లాట్ బుకింగ్ విధానాన్ని తీసుకువచ్చి రిజిస్ట్రేషన్ ప్రక్రియను సులభతరం చేసిందన్నారు. పబ్లిక్ డేటా ఎంట్రీ(పీడీఈ) సిస్టమ్ ద్వారా, రిజిస్ట్రేషన్ల శాఖ అధికారిక వెబ్‌సైట్‌లోని స్లాట్ బుకింగ్ మాడ్యూల్ ద్వారా, అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఉండే క్యూఆర్ కోడ్ స్కాన్ చేయడం ద్వారా స్లాట్ బుక్ చేసుకోవచ్చన్నారు. స్లాట్ బుకింగ్ వల్ల సమయం ఆదా అవడంతో పాటుగా కార్యాలయాల చుట్టూ తిరిగే అవసరాలు తగ్గుతాయన్నారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అనధికారిక కార్యకలాపాలు, నకిలీ రిజిస్ట్రేషన్లు తగ్గుతాయన్నారు. ఏప్రిల్ 4 నుంచి రాష్ట్రంలోని 26 జిల్లాల్లోని ప్రధాన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఈ సౌకర్యం అందుబాటులోకి వచ్చిందన్నారు. ప్రస్తుతం జిల్లాలోని 11 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు స్లాట్ బుకింగ్ వ్యవస్థను విస్తరించినట్లు తెలిపారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్టాంపుల కొరతపై మీడియా ప్రశ్నకు సమాధానమిస్తూ...స్టాంపులు వచ్చాయని, అయితే వేరియేషన్స్ కారణంగా ఆన్‌లైన్‌లో ఎంటర్ చేయలేకపోతున్నామన్నారు. త్వరలో సమస్యకు పరిష్కారం వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సబ్ రిజిస్ట్రార్ గురుస్వామి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అన్నమాచార్య యూనివర్సిటీలో పారామెడికల్ కోర్సులు ప్రారంభం



ఏయూ పారామెడికల్ కోర్సుల ప్రారంభోత్సవ సభలో మాట్లాడుతున్న ఏయూ చాన్సలర్

రాజంపేట : అన్నమాచార్య యూనివర్సిటీలో ఆరోగ్య శాస్త్రాల శాఖ (పారామెడికల్ వింగ్స్)ను ప్రారంభించామని అన్నమాచార్య యూనివర్సిటీ చాన్సలర్ చొప్పా గంగిరెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక ఏయూ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన తొలి బ్యాచ్ విద్యార్థులకు ఓరియంటేషన్ ప్రోగ్రాంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీఎస్సీ అనస్థీషియా టెక్నాలజీ అండ్ ఆపరేషన్ టెక్నాలజీ, మెడికల్ ల్యాబ్, బీపీటీ కోర్సులు ఆరోగ్య రంగంలో ప్రాధాన్యత వహిస్తున్నాయన్నారు. నేటి ఆరోగ్య వ్యవస్థలో పారా మెడికల్ కోర్సులు కీలక పాత్ర పోషిస్తున్నాయన్నారు. ఫిజియోథెరపీ ఇప్పుడు డిమాండ్ ఉన్న కోర్సు అన్నారు. ఏయూ వీసీ డాక్టర్ సాయిబాబారెడ్డి మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య సేవల నుంచి ప్రత్యేక చికిత్స వరకు ప్రతి రంగంలో పారామెడికల్ నిపుణుల అవసరం ఉందన్నారు. ఏఐటీఎస్ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి, పారామెడికల్ ఇన్‌చార్జి డాక్టర్ ద్వారకానాథరెడ్డిలు హాజరయ్యారు.

డాక్టరమ్మ.. విధులకు డుమ్మా



పి. కొత్తపల్లె పీహెచ్‌సీలో వైద్యాధికారిణి కుర్చీ ఖాళీగా దర్శనమిస్తున్న దృశ్యం



హాజరు రిజిస్టర్‌లో ఈనెల 26 నుంచి సంతకాలు చేయని వైద్యాధికారిణి

రోగులకు అందుబాటులో ఉండని పి. కొత్తపల్లె వైద్యాధికారిణి

సిద్దవటం : మండలంలోని పి. కొత్తపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి డాకర్ రంగలక్ష్మి బుధవారం విధులకు గైర్హాజరయ్యారు. ఇక్కడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇద్దరు వైద్యులు పని చేస్తున్నా డాక్టర్ శ్రీనివాసులరెడ్డి 104 సంచార వాహనం ద్వారా వైద్య సేవలను అందించేందుకు వెళ్లారు. మరో డాక్టర్ రంగలక్ష్మి విధులకు రాకపోవడంతో అక్కడి స్టాఫ్ నర్సు వచ్చిన రోగులకు వైద్య సేవలను అందిస్తున్నారు. డాక్టరమ్మ వారానికి ఒక్కసారే వైద్య శాలకు వస్తారని, హాజరు పట్టికలో ఆమె విధులకు హాజరైన రోజున వారానికి సరిపడా సంతకాలు చేస్తున్నట్లు బట్ట బయలైంది. ఈనెల 25వ తేదీ వరకు హాజరు పట్టికలో వైద్యురాలు సంతకాలు చేశారు. ఆ తర్వాత నుంచి ఏప్రిల్ 30వ తేదీ వరకు సంతకాలు చేసిన దాఖలాలు లేవు. జిల్లా కలెక్టర్ స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఆటో బోల్తా

పోరుమామిళ్ల : పట్టణానికి కిలోమీటర్ దూరంలో ఈదుళ్లపల్లె వద్ద బుధవారం సాయంత్రం ఆటో బోల్తా పడిన ఘటనలో చింతలపల్లెకు చెందిన శ్రీను తీవ్రంగా గాయపడ్డాడు. ఆటో డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. పోరుమామిళ్ల వైపు వస్తున్న కారు వెనుకే ఆటో వస్తుండగా ఈదుళ్లపల్లె వద్ద కారు సడన్‌గా బ్రేక్ వేయడంతో కారుకు ఆటో గుద్దుకుంటుందన్న భయంతో ఆటో డ్రైవర్ కూడా బ్రేక్ వేయడంతో ఆటో బోల్తా పడింది. ఆటోలో ప్రయాణిస్తున్న శ్రీను కింద పడటంతో అతనిపై ఆటో పడింది. దీంతో ముఖం, ఛాతీ, కాళ్లు, చేతులకు గాయాలయ్యాయి. ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రథమ చికిత్స చేశారు.

అదుపు తప్పి కారు బోల్తా

వేముల : మండలంలోని భూమయ్యగారిపల్లె క్రాస్ వద్ద బుధవారం కారు అదుపు తప్పి అరటి తోటలోకి దూసుకెళ్లింది. ఈ సంఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. వేంపల్లె మండలం తాళ్లపల్లె గ్రామానికి చెందిన వెంకట్రామయ్య కుటుంబ సభ్యులతో కదిరిలో జరిగే వివాహ కార్యక్రమానికి వెళ్లారు. వివాహ అనంతరం స్వగ్రామానికి బయలుదేరారు. కారు భూమయ్యగారిపల్లె క్రాస్ వద్దకు రాగానే మోటారు సైకిల్‌ను తప్పించబోయి అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న అరటి తోటలోకి దూసుకెళ్లింది. ఈ సంఘటనలో ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. కారులో ఉన్న వారంతా క్షేమంగా బయటపడ్డారు.

పిడుగుపాటుతో వ్యక్తి మృతి

ప్రొద్దుటూరు క్రైం : ప్రొద్దుటూరు మండలం మీనాపురం గ్రామంలో పిడుగు పాటుకు గురై చిట్టిబోయిన మునిస్వామి (45) అనే వ్యక్తి మృతి చెందాడు. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మునిస్వామి సొంత ట్రాక్టర్‌తో పెన్నానదిలోని ఇసుకను బాడుగకు తోలుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అతనికి భార్య లక్ష్మీతో పాటు పవన్‌కుమార్, తేజ అనే ఇరువురు కుమారులు ఉన్నారు. తన చెల్లెలికి పశువులు ఉన్నందున వాటికి మేత వేసేందుకు బుధవారం సాయంత్రం గ్రామ సమీపంలోని వ్యవసాయ పొలం వద్దకు వెళ్లాడు. అప్పటికే ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం ప్రారంభమైంది. ఈ క్రమంలో పిడుగు పడటంతో షాక్‌కు గురై మునిస్వామి కింద పడిపోయాడు. స్థానికులు వెంటనే అతన్ని జిల్లా ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లగా వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్‌ఐ వెంకటసురేష్ తెలిపారు.

34 ఎర్రచందనం దుంగలు, ఇన్నోవా వాహనం సీజ్



ఎర్రచందనం, ఇన్నోవాలను సీజ్ చేసిన అటవీశాఖ అధికారులు

కడప అర్బన్ : మామిళ్లపల్లి సెక్షన్, ఇప్పపెంట బీటు, పాలకొండ రిజర్వు ఫారెస్ట్‌లోని 'వంక బావి రస్తా' ప్రదేశంలో ఒక ఇన్నోవా వాహనం, 34 ఎర్రచందనం దుంగలను అటవీ శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. జిల్లా అటవీశాఖ అధికారి వినీత్ కుమార్ సమాచారం ప్రకారం కడప ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ కె. ప్రసాద్ ఆధ్వర్యంలో మామిళ్లపల్లి, మద్దిమడుగు సెక్షన్ సిబ్బంది, స్ట్రైకింగ్ ఫోర్స్, బేస్ క్యాంపు సిబ్బంది ఈ దాడిలో పాల్గొన్నారు. పారిపోయిన నిందితులను త్వరలో పట్టుకుంటామని అధికారులు తెలిపారు. వాహన రిజిస్ట్రేషన్ నెంబర్ ఆధారంగా (ఏపీ 37 సీహెచ్ 9919) యజమాని పులి వరప్రసాద్ రవికుమార్, రామేశ్వరం, ప్రొద్దుటూరుగా గుర్తించామన్నారు. ఈ దాడిలో మామిళ్లపల్లి సెక్షన్ డిప్యూటీ ఆర్‌ఓ ఎస్. ఓబులేసు, మద్దిమడుగు ఎఫ్‌ఎస్‌ఓ షకీల్ అహమ్మద్, ఎఫ్‌బీఓలు కె. శోభారాణి, ఎస్.బాషా, ఎస్.రఘువీర్ పాల్గొన్నారు.

కట్నం కోసం వేధింపు కేసులో రెండేళ్ల జైలు



జైలు శిక్ష పడిన ముద్దాయితో కోర్టు కానిస్టేబుల్ బావాజాన్

పెద్దతిప్పసముద్రం : కట్టుకున్న భార్యను అదనపు కట్నం కోసం నిత్యం వేధింపులకు గురి చేసిన భర్తకు తంబళ్లపల్లి న్యాయస్థానం ముద్దాయికి రెండేళ్ల జైలు శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చింది. వివరాల్లోకి వెళితే.. మండలంలోని టి.సదుం పంచాయతీ గుంటిపల్లికి చెందిన ములాతి శశికళ అనే మహిళకు కర్నాటక రాష్ట్రం చింతామణి సమీపంలోని జుంజునపల్లికి చెందిన చిన్నపరెడ్డి కుమారుడు జేసీ మంజునాథ్‌రెడ్డి (45)తో వివాహమైంది. కొన్నాళ్ల పాటు వీరి కాపురం సజావుగా సాగింది. అనంతరం తన భర్త నిత్యం కట్నం కోసం భార్యను వేధింపులకు గురి చేస్తుండటంతో బాధితురాలు శశికళ 2013లో పీటీఎం పోలీసులకు ఫిర్యాదు చేసింది. అప్పటి ఎస్‌ఐ ఏ.గంగాధర్ 87/2013లో కేసు నమోదు చేశారు. అప్పటి నుంచి ఈ కేసుపై కోర్టులో విచారణ కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో బుధవారం కేసు తుది విచారణ కొనసాగింది. ఏపీపీ వీరాంజనేయులు వాదనలు, కేసు పూర్వాపర వివరాలు, సాక్షుల విచారణ విన్న తంబళ్లపల్లి న్యాయమూర్తి ఏ.ఉమర్ ఫరూక్ ముద్దాయి మంజునాథ్‌రెడ్డికి రెండేళ్ల జైలు శిక్షతో పాటు రూ.10 వేల జరిమానా విధించినట్లు ఎస్‌ఐ హరిహర ప్రసాద్, కోర్టు కానిస్టేబుల్ బావాజాన్‌లు తెలిపారు.

కొడుకు దూరమై.. బతుకు భారమై

కొడుకు మృతితో తల్లికి తీరని వేదన



టైలర్ బాలకృష్ణ మృతదేహం

కురబలకోట/బి.కొత్తకోట: ప్రముఖ పర్యాటక కేంద్రం హార్సిలిహిల్స్‌లోని గంగోత్రి చెరువులో ఈతకు వెళ్లి మృతి చెందిన బి. కొత్తకోటకు చెందిన బాలకృష్ణ (29) మృతదేహాన్ని బుధవారం ఉదయం అగ్నిమాపక సిబ్బంది బోటు సాయంతో వెలికి తీశారు. పోలీసులు మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పోస్టు మార్టం నిర్వహింపజేశారు. బాలకృష్ణ బి.కొత్తకోట కాలనీలో టైలర్‌గా ఉన్నారు. ఇతని సంపాదనతోనే రోజులు గడిచేవి. ఇతను ఒక్కడే కుటుంబానికి ప్రధాన జీవనాధారం. ఇతను అవివాహితుడు. పెళ్లి సంబంధాలు చూస్తున్న తరుణంలో ఈతకు వెళ్లి ఆకస్మికంగా మృతి చెందడం కలచివేస్తోంది. ఇతనికి ఈత వచ్చినప్పటికీ చెరువు చివరి వరకు వెళతానని వెళ్లాడు. మధ్యలోకి వెళ్లాక ఈదలేక ఊహించని పరిస్థితిలో మునిగిపోయి చనిపోయినట్లు పోలీసులు చెబుతున్నారు. ఇతని తండ్రి శ్రీనివాసులు ఆరేళ్ల క్రితం హఠాత్తుగా గుండెపోటుతో మృతి చెందారు. అక్క పద్మజకు వివాహమైంది. తల్లి మంజుల (50) నిస్సహాయురాలు. అన్న శివ కృష్ణ (35) మానసిక వికలాంగుడు. తల్లిని, అన్నను ఇతనే చూసుకునే వాడు. ఇప్పుడు అతను తిరిగిరాని లోకానికి వెళ్లిపోవడంతో వారి బతుకు ప్రశ్నార్థకంగా మారింది. తల్లి మంజుల పరిస్థితిని తలచుకుని బంధుమిత్రులు వేదన పడుతున్నారు. ఆధారంగా ఉన్న కొడుకు దూరం కావడంతో ఆ తల్లి తల్లడిల్లుతోంది.

టమాటా రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి



ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి

గుర్రంకొండ : జిల్లాలో టమాటా రైతులు పండించిన టమాటాకు గిట్టుబాటు ధరలు కల్పించాలి, జిల్లాకు హంద్రీనీవా నీళ్లు అందించి రైతులను ఆదుకోవాలని రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఆయన మండలంలోని తరిగొండ, మర్రిపాడు, టి.రాచపల్లె, రామాపురం గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండుటెండలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలకు వారాల తరబడి బిల్లులు చెల్లించకపోవడం దారుణమన్నారు. జిల్లాలోని పడమటి మండలాల్లో సాగు నీరు లేక భుగర్భ జలాలు అడుగంటిపోయి బోర్లు ఎండిపోతున్నాయన్నారు. తద్వారా చేతికొచ్చిన పంటలు ఎండిపోతుండడంతో రైతులు భారీగా నష్టపోతున్నారని చెప్పారు. ఈ ప్రాంతానికి వెంటనే హంద్రీనీవా నీళ్లు ఇచ్చి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. క్యార్యక్రమంలో జిల్లా రైతు సంఘం ఉపాధ్యక్షుడు రమేష్‌బాబు, నాయకులు వెంక్రటమణ, సుధాకర్‌రెడ్డి, రెడ్డెప్ప పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలు

నిమ్మనపల్లె : బంధువుల పెళ్లికి వెళ్లి తిరిగి ఇంటికి వెళ్తున్న ఇద్దరు యువకులు రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సంఘటన మంగళవారం రాత్రి నిమ్మనపల్లి మండలంలో జరిగింది. స్థానికులు, పోలీసుల వివరాల మేరకు.. మదనపల్లి పట్టణం బాబు కాలనీకి చెందిన ఎం.అశోక్ కుమార్ (22), వైఎస్సార్ కాలనీకి చెందిన ఎం.ప్రదీప్ (18) ఇద్దరు యువకులు కలసి ద్విచక్ర వాహనం లో నిమ్మనపల్లి మండలం తవళం పంచాయతీలోని నేల మల్లేశ్వర స్వామి ఆలయం వద్ద జరుగుతున్న బంధువుల పెళ్లికి వెళ్లారు. తిరిగి రాత్రి 10 గంటలకు మదనపల్లెకు వెళుతుండగా, మార్గమధ్యంలోని రాచవేటివారిపల్లి పంచాయతీ ఎగువమాచిరెడ్డిగారి పల్లె వద్ద ద్విచక్ర వాహనం అదుపుతప్పి కిందపడి తీవ్రంగా గాయపడ్డారు. గమనించిన స్థానికులు 108 వాహనంలో బాధితులను మదనపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వారి పరిస్థితి విషమంగా ఉండడంతో ప్రదీప్‌ను తిరుపతి రుయా ఆసుపత్రికి, అశోక్ కుమార్‌ను తిరుపతి లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. స్థానిక పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని ద్విచక్రవాహనదారుడు మృతి




మృతి చెందిన సఫయాత్‌ఖాన్



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

చిన్నమండెం : మండల పరిధిలోని కడప-బెంగళూరు జాతీయ రహదారి మల్లూరు క్రాస్ వద్ద మామిడి కాయల మండీ సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ద్విచక్రవాహనదారుడు పి.సఫయాత్‌ఖాన్(32) మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. పి.సఫయాత్‌ఖాన్, ఇబ్రహీం ఖాన్‌లు తమ సొంత పనుల నిమిత్తం ద్విచక్రవాహనంలో వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం వీరిని ఢీకొందన్నారు. ఈ ప్రమాదంలో సఫయాత్‌ఖాన్ అక్కడికక్కడే మృతి చెందగా ఇబ్రహీం ఖాన్‌కు గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని 108 సాయంతో రాయచోటి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రణాళిక బద్ధంగా చదివితే ఐఐటీ, నీట్‌లో ర్యాంకు తథ్యం



మాట్లాడుతున్న విద్యావేత్త రాహుల్

కడప కోటిరెడ్డిసర్కిల్ : విద్యార్థులు ప్రణాళిక బద్ధంగా చదివితే సీట్ పరీక్షల్లో ర్యాంకు సాధించడం తథ్యమని విద్యా వేత్త రాహుల్ తెలిపారు. రాయచోటిలోని శ్రీ సాయి కాన్సెప్ట్ స్కూలులో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఐఐటీ, నీట్ ఫౌండేషన్ కోర్సుల ప్రాముఖ్యతను తెలియజేశారు. 2025-26 సంవత్సరం నుంచి శ్రీ సాయి కాన్సెప్ట్ స్కూలులో రిసోర్సెస్ పద్ధలో ఐఐటీ, నీట్ బోధనను 6వ తరగతి నుంచి పదవ తరగతి విద్యార్థులకు బోధిస్తారన్నారు. కార్యక్రమంలో శ్రీ సాయి విద్యాసంస్థల డైరెక్టర్ హీరా రాజు, శ్రీ సాయి కాన్సెప్ట్ స్కూల్ హెడ్మాస్టర్ త్యాగరాజన్‌తోపాటు పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మే 2వ తేదీ జిల్లాస్థాయి బాస్కెట్‌బాల్ సబ్ జూనియర్స్ ఎంపికలు

కడప ఎడ్యుకేషన్ : కడప జిల్లా బాస్కెట్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మే 2వ తేదీన జిల్లా స్థాయి బాస్కెట్ బాల్ సబ్ జూనియర్ బాలబాలికల ఎంపికలు నిర్వహిస్తున్నట్లు బాస్కెల్‌బాల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సహదేవరెడ్డి తెలిపారు. ఈ పోటీలను కడప నగరం జయనగర్ కాలనీలోని జిల్లా పరిషత్తు బాలికల ఉన్నత పాఠశాలలో 2వ తేదీ సాయంత్రం 4 గంటలకు నిర్వహిస్తారన్నారు.

ఆసక్తి గల క్రీడాకారులు ఒరిజినల్ ఆధార్ కార్డుతో 2012 జనవరి 1వ తేదీ తర్వాత పుట్టిన వారు మాత్రమే హాజరు కావాలని తెలిపారు.